

# సెప్టెంబరు 2009లో రాష్ట్ర వ్యవసాయరంగం

**కె. శ్రీనివాసరెడ్డి** (అన్నదాత బ్యూరో)

సెప్టెంబరు నెల చివరతో ముగిసిన ఖరీఫ్ సీజన్ రైతుల్లో కన్నీళ్ళు మిగిల్చింది. సాగు విస్తీర్ణం తగ్గడం, వర్షాభావ పరిస్థితుల కారణంగా వ్యవసాయ ఉత్పత్తులు బాగా తగ్గుతాయని రాష్ట్ర అర్థగణాంకశాఖ ముందస్తు అంచనా. ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 79.04 ల.హె. కాగా 63.91 ల.హె.లోనే పంటలు వేశారు. సాగుచేసిన ఈ పంటల్లో తీవ్ర వర్షాభావంతో 14 ల.హె., భారీ వర్షాలతో, 2.41 ల.హె.లో పైర్లు దెబ్బతిన్నాయి. ఆహారధాన్యాల సాగు 10 ల.హె., నూనెగింజల సాగు 5.51ల.హె. మేర తగ్గింది. సాధారణ విస్తీర్ణంతో పోల్చితే గతేడాది వచ్చిన లాభాల దృష్ట్యా సాధారణ విస్తీర్ణం మించి పత్తిసాగు 12.70 ల.హె.లో జరిగినా వర్షాభావం వల్ల హెక్టారు సగటు దిగుబడులు 421 కిలోల నుంచి 390 కిలోలకు పడిపోయినట్లు అంచనా. ఉత్పత్తి అంచనాల్లో ఆహార ధాన్యాల్లో 45.64 ల.ట., నూనెగింజల పంటల్లో 6.23 ల.ట., అపరాల్లో లక్ష టన్నుల మేర తగ్గనున్నట్లు ముందస్తు అంచనా.

## వరదలతో పంట నష్టం:

సెప్టెంబరు 28 నుంచి అక్టోబరు 3 వరకు కురిసిన వర్షాలు, వరదల బీభత్సానికి రాష్ట్రంలో రూ. 12,225 కోట్ల నష్టం వాటిల్లినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. కర్నూలు, మహబూబ్‌నగర్, నల్గొండ, గుంటూరు, కృష్ణా తదితర 12 జిల్లాల్లో వరదల కారణంగా దాదాపు 2.41 ల.హె.లో పంటలు నీట మునిగాయి. 90 మంది మృతి చెందారు. 2.13 లక్షల ఇళ్లు దెబ్బతిన్నాయి. వ్యవసాయ, ఉద్యాన పంటలకు రూ. 1050 కోట్లు, పశుసంవర్ధశాఖకు రూ. 275 కోట్లు, మత్స్య శాఖకు రూ. 100 కోట్లమేర నష్టం జరిగినట్లు అంచనా. సుమారు 4.20 ల. ఎకరాల్లో వ్యవసాయపంటలు, 80 వేల ఎకరాల్లో ఉద్యానపంటలు నీట మునిగాయి. పంటలవారీగా చూస్తే వరి 1.30 ల.ఎకరాలు, పత్తి 80 వేలు, వేరుసెనగ 30 వేలు, కూరగాయపంటలు 23 వేలు, అరటి 10 వేలు, ఉల్లి 14 వేలు, మిరప 17 వేలు, టొమాటో 7.5 వేలు, పసుపు 5.7 వేల ఎకరాల్లో నీట మునిగినట్లు నివేదికలు రూపొందించారు. పెట్టుబడి రాయితీగా వరదలకు దెబ్బతిన్న వ్యవసాయ పంటలకు రూ. 75 కోట్లు, ఉద్యాన పంటలకు రూ. 24 కోట్లు ఇవ్వాల్సి ఉంటుందని ఆయా శాఖల కమిషనర్లు నివేదికలు తయారుచేశారు. వర్షాభావంతో ఆగస్టు 15 వరకు ఎండిపోయిన పంటలకు పెట్టుబడి రాయితీగా రూ. 391 కోట్లు చెల్లించాలని ప్రభుత్వానికి ఇదివరకే నివేదికలు పంపారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో రాష్ట్ర ప్రభుత్వం 681 కరవు మండలాలను ప్రకటించినా తమకు ఎలాంటి సహాయ సహకారాలు అందడంలేదని రైతులు వాపోయారు. బియ్యం, పప్పులు, కూరగాయలు, బెల్లం, చక్కెర వంటి నిత్యావసర సరకుల ధరలు పెరగడంతో వినియోగదారులు ఇబ్బందులెదుర్కొన్నారు. సెప్టెంబరు నెలలో రాష్ట్ర రైతాంగం ఎదుర్కొన్న సమస్యల తీరు క్లుప్తంగా...

## ఆహారధాన్య పంటలు

ఈ ఏడాది ఖరీఫ్ వరి పంటకు మద్ధతు ధరగా క్వింటాకు 'ఏ' గ్రేడ్ ధాన్యానికి రూ. 980, సాధారణ రకానికి రూ. 950 ధరగా కేంద్రప్రభుత్వం నిర్ణయించింది.

**అనంతపురం** జిల్లాలో కదిరి పట్టణం నుంచి వచ్చే మురుగునీటిని రైతులు చిన్న చిన్న కాలువల్లోకి మళ్లించి సాగునీటిగా వాడుకుంటున్నారు. ఈ నీటితో మొక్కజొన్న సాగుచేసి ఎటువంటి ఎరువులు వాడకుండా ఎకరాకు 20-30 క్వింటాళ్ల దిగుబడితో రూ. 15 వేలదాకా ఆదాయం పొందుతున్నారు.

**ఖమ్మం** జిల్లాలో దమ్మపేట మండలం నాచారానికి చెందిన కొందరు రైతులు సాగుచేసిన మోతీ గోల్డ్ రకం వరి విత్తనాలు కల్తీవి కావడంతో నిర్ణీత పంటకాలం కన్నా ముందే వెన్నులు తొడిగి దపదఫాలుగా ఈనుతుండడంతో ఆవేదన చెందారు.

**మెదక్** జిల్లా ములుగు, వర్గల్ ప్రాంతాల్లో ప్రతికూల వాతావరణం, నకిలీ విత్తనాల వల్ల ఆగ్రోస్ కేంద్రం సరఫరా చేసిన ఓ ప్రయివేటు కంపెనీ రకం మొక్కజొన్న పైరులో ఒక్కో మొక్కకు ఒకటి కంటే ఎక్కువగా చిన్న సైజు కంకులు వచ్చి గింజలు ఏర్పడక నష్టపోయారు. జిల్లాలో మొక్కజొన్న దిగుబడి బాగా తగ్గిపోయినా గతేడాది రూ. 950 ఉన్న క్వింటా ధర రూ. 800కు పడిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు.

## వాణిజ్య పంటలు

**శ్రీకాకుళం** జిల్లాలో 2006లో ఉన్న 30 వేల ఎకరాల చెరకు సాగు విస్తీర్ణం ఈ సంవత్సరం 8500 ఎకరాలకు పడిపోయింది. పెట్టుబడులు పెరిగి, దిగుబడులు తగ్గడంతో సాగు గిట్టుబాటుగాక ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గు చూపారు. కృష్ణా జిల్లాలో చెరకుసాగు 30వేల హె.నుంచి 14వేల హె.కు పడిపోయింది.

**నెల్లూరు** జిల్లాలో గత పదేళ్లలో చెరకు సాగు 15 వేల హె.నుంచి 4 వేల హె.కు పడిపోవడంతో చక్కెర ఫ్యాక్టరీల భవిత ప్రశ్నార్థకంగా మారింది.

✦ కోనసీమ కొబ్బరి రైతులు ధర దక్కక అంబాజీపేటలో ధర్నా చేశారు. కొబ్బరికాయలను పెట్రోలు పోసి తగులబెట్టి తమ నిరసన తెలిపారు. వెయ్యి కాయలకు రూ. 4450 మద్ధతు ధర ప్రకటించి, నాఫెడ్ ద్వారా కొనుగోళ్లు జరపాలని వారు కోరారు. ఉద్దానం ప్రాంతంలో వెయ్యి కాయల ధర రూ. 1500 మాత్రమే పలికింది.

**కృష్ణా, గుంటూరు, ప్రకాశం** జిల్లాల్లో పత్తి పంటపై పేనుబంక, పచ్చదోమ, తెల్లదోమ వంటి రసం పీల్చే పురుగులకు తోడు ఎండుతెగులు తీవ్రంగా దాడి చేశాయి. **గుంటూరు** జిల్లాలో గతేడాదితో పోల్చితే సుమారు 35 వేల హెక్టార్లలో పత్తిసాగు తగ్గిపోతే, ప్రకాశం జిల్లాలో దాదాపు సగానికి పడిపోయింది.

**ప్రకాశం** జిల్లాలో గతేడాది వైట్ బర్లీ పొగాకు సాగుచేసిన రైతులకు మంచి దిగుబడి, ఆదాయం రావడంతో రాచర్ల మండలంలో ఈ పంట సాగును 200 ఎకరాల నుంచి 700 ఎకరాలకు పెంచేందుకు సిద్ధమయ్యారు.

**నెల్లూరు** జిల్లా కొండాపురం మండలంలో రుద్ర బీటీ-1 పత్తి విత్తనాలు సాగుచేసిన కొమ్మి, సత్యవోలు, ఉప్పలూరు రైతులు పైరు బాగానే పెరిగినా కాపులేక ఎకరాకు క్వింటా దిగుబడి రాని పరిస్థితితో తీవ్రంగా నష్టపోయారు. **కడప** జిల్లా కలసపాడు మండలంలో వర్షాభావానికి తెగుళ్లు తోడవ్వడంతో ఎకరాకు 2 క్విం. మించి పత్తి దిగుబడి రావడంలేదని రైతులు వాపోయారు. **ఆదిలాబాద్** జిల్లాలో రసం పీల్చే పురుగులు ఎక్కువగా నష్టం కలిగించాయి. **వరంగల్**



T

జిల్లాలో ఎండుతెగులు, రసం పీల్చే పురుగులు, ఖమ్మం జిల్లాలో ఎండు తెగులు, సూక్ష్మపోషక లోపాలు పత్తి పంటను నష్టపరిచాయి.

**ఖమ్మం** జిల్లాలో వర్షాభావం వల్ల 20 వేల ఎకరాల్లో మిరప పంట ఎండిపో యింది. కాండంకుళ్లు తెగులు ఎక్కు వగా ఆశించింది. మహబూబ్‌నగర్ జిల్లా తిమ్మాజిపేట ప్రాంతంలో నేరుగా సాళ్లలో విత్తనం ఎదబెట్టి సాగుచేసిన మిర్చి తోటలు మొలక దశలోనే కుళ్లి ఎండిపోయాయి. దీంతో కొందరు మిర్చి తోటలు దున్నేసి పత్తి సాగుకు పూనుకు న్నారు.

## నూనెగింజ పంటలు

**కడప** జిల్లా రాయచోటి నియోజకవ ర్గంలో వేరుసెనగ పంటపై ఎర్రగొం గళి పురుగు తీవ్రంగా నష్టపరిచింది. సుమారు 10 వేల హెక్టార్లలో పంట దెబ్బతినడంతో రైతులు బెంబేలె త్తారు.

**కర్నూలు** జిల్లాలో వేరుసెనగ పంటపై పచ్చపురుగు, ఆకుముడత, ఆముదం పంటలో నామాల (దాసరి) పురుగు నష్టపరిచాయి. జిల్లాలో వర్షా భావం వల్ల వేరుసెనగ పైరు సరిగా ఎదగక, కాయలు సరిగా ఏర్పడక నష్టపోయారు. సమయం దాటాక కురుస్తున్న వర్షాలతో వేరుసెనగ ప్రయోజనం లేదని గ్రహించిన కొన్ని ప్రాంతాల్లో రైతులు వేరుసెనగను దున్నేసి జొన్న సాగుకు మొగ్గు చూపారు.

## పండ్ల తోటలు

**విజయనగరం** జిల్లాలో ఈ ఏడాది మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఈదరుగా లులకు నష్టపోయిన అరటి పంటకు రూ. 5.82 కోట్ల పరిహారం మంజూ రయ్యింది.

**గుంటూరు** జిల్లా ముప్పాళ్ళ మండ లంలో వరి, పత్తి, మిర్చి పంటలతో విసుగు చెందిన నార్నేపాడు గ్రామ రైతులు పంట మార్పిడిగా గులాబీ సాగుచేస్తూ ఎకరాకు రూ. 40-60 వేలదాకా ఆదాయం పొందుతున్నారు.

**నెల్లూరు** జిల్లాలో ఈ ఏడాది వర్షా భావంతో బత్తాయి తోటలు ఎండి పలు వురు రైతులు నష్టపోయినా అష్టక ష్టాలు పడి తోటల్ని దక్కించుకున్న రైతులకు మంచి ధర లభించింది. గతంలో రూ. 4 వేలున్న టన్ను కాయల ధర రూ. 15 వేలకు పెర గడం గమనార్హం.

**కడప** జిల్లాలో వర్షాభావంతో నిమ్మ తోటలు దెబ్బతిని దిగుబడి సగానికి తగ్గిపోయింది. అయితే ధర మాత్రం రికార్డు స్థాయిలో బస్తా కాయల (800 కాయలు)కు రూ. 2 వేలదాకా పలికింది. గత 40 ఏళ్లలో ఎప్పుడూ ఇంత ధర చూడలేదని ఓ వ్యాపారి పేర్కొనడం గమనార్హం. ప్రకాశం జిల్లాలో రైతుకు కిలో నిమ్మకాయల ధర రూ. 35-50 దాకా లభించింది.

**చిత్తూరు** జిల్లా శంకర్రాయలపేట రైతు శ్రీనివాసులు డ్రిప్ పద్ధతిలో మూడెకరాల్లో అరటిసాగు చేసి మొదటి పంటలోనే ఎకరాకు రూ. 75 వేలకు పైగా ఆదాయం పొందాడు. పూలసాగులో కూడా రాణిస్తున్న ఈ రైతు ఉద్యానశాఖ నుంచి జిల్లా స్థాయిలో ఆదర్శరైతుగా ఎంపికవ్వడం ఎంతైనా అభినందనీయం.

❖ వర్షాభావం పండ్ల తోటల దిగుబ డులపై ప్రభావం చూపింది. సీతా ఫలం చెట్లకు పూత, పిందె రాక దిగు బడి బాగా తగ్గింది.

## కూరగాయల పెంపకం

**విశాఖ** జిల్లా పాయకరావుపేట మండలంలోని సత్యవరానికి చెందిన కీర్తి సీతారాం తన ఇంటి పెరట్లో వివిధ రకాల కూరగాయలు పండిస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నారు. తమ ఇంటి అవసరాలకు పోనూ మిగతావి మార్కెట్ చేసి నెలకు రూ. 3 వేలకు పైగా ఆదాయం పొందుతున్నారు.

**విజయనగరం** పట్టణం కంటోన్మెంట్ ప్రాంతానికి చెందిన మల్లిక తన మేడ పైన కుండీలలో వివిధ రకాల కూరగా యలను పండిస్తూ నెలకు తమ ఇంటి కయ్యే రూ. 1200 కూరగాయల ఖర్చును ఆదా చేస్తున్నారు.

**తూర్పుగోదావరి** జిల్లాలోని మెట్ట ప్రాంతాల్లో కూరగాయలు పండించిన రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా లభించలేదు. రైతు నుంచి కొన్న ధరను మూడు రెట్లకు పైగా పెంచి వినియోగదారులకు అమ్మి దళారులే ఎక్కువ లబ్ది పొందారు.

**గుంటూరు** జిల్లాలో రైతులకు సబ్సి డీపైన అందజేయాల్సిన 9 కిలోల హైబ్రిడ్ టొమోటో విత్తనాలను (విలువ రూ. 3 లక్షలు) ఉద్యాన శాఖ అధికారి శ్రీనివాసరావు పక్క దారి పట్టించినట్లు తేలడంతో ఆయ నపై పోలీసు కేసు నమోదు చేసి, సస్పెండ్ చేశారు.

**ప్రకాశం** జిల్లా రాచర్ల మండలంలోని పలుగుంటిపల్లె రైతులు వివిధ రకాల నారుమళ్లను పెంచి ఇతరులక మ్ముతూ ఖర్చులు పోనూ ఎకరా నారుమడి నుంచి రూ. 50 వేల నుంచి రూ. లక్ష దాకా నికరాదాయం పొందుతున్నారు.

**కడప**జిల్లా లింగాల ప్రాంతంలో సాంబారు దోస సాగుచేసిన రైతులు వర్షా భావం, తెగుళ్ల బెడదతో దిగుబడి తగ్గి, ధర పడిపోయి నష్టాలు చవిచూశారు.

**కర్నూలు** జిల్లాలో టొమాటో సాగు చేసిన రైతులకు దిగుబడి బాగానే వచ్చినా, 20 కిలోల గంప ధర ఒక్క సారిగా రూ. 150 నుంచి రూ. 80కి పడిపోవడంతో నష్టపోయారు. ఆదోని మార్కెట్లో రైతుకు కిలో రూ. 4 మాత్రమే దక్కగా వ్యాపారులు మాత్రం కిలో రూ. 14 చొప్పున విని యోగదారులకమ్మి లబ్దిపొందారు.

జిల్లాలోని పలు ప్రాంతాల్లో వైరస్, బాక్టీరియా తెగుళ్లతో టొమాటో పైరు తీవ్రంగా దెబ్బతింది. ఉల్లి పంటలో బిల్లేకల్లు గ్రామరైతులు ఎకరాకు 200 బస్తాల దిగుబడి సాధించడమే గాక, క్వింటా ధర రూ. 600-800 పలక డంతో ఆనందం వ్యక్తం చేశారు. పత్తి కొండ మండలంలోని రామచంద్రా పురం గ్రామంలో కొత్తిమీర సాగు చేసిన రైతులు అగ్గితెగులు సోకి తీవ్రంగా నష్టపోయారు.

**అనంతపురం** జిల్లా పరిగి మండల పరిధిలో టొమాటో సాగు చేసిన రైతులకు కిలో రూ. 2 మాత్రమే రావడంతో పెట్టుబడులు కూడా దక్క లేదు. కిలోకు రూ. 10 మద్దతు ధర కల్పించాలని వారు కోరారు.

**రంగారెడ్డి** జిల్లా చేవెళ్ల ప్రాంతంలో క్యాబేజి పండించిన రైతులకు దిగు బడి బాగానే వచ్చినా 10 కిలోలకు రూ. 20-40 మాత్రమే ధర లభించ డంతో పెట్టుబడి కూడా రాలేదు.

## అనావృష్టి-అతివృష్టి

ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు లేక అనావృష్టితో, చివరలో అధిక వర్షా లతో ఖరీఫ్ పంటలు బాగా దెబ్బతి న్నాయి.

**విశాఖ** జిల్లాలో కరవు పరిస్థితుల కారణంగా పైర్లు ఎండిపోయి దాదాపు రూ. 728 కోట్లమేర నష్టం వాటిల్లను న్నట్లు వ్యవసాయశాఖ అంచనా వేసింది.

**కృష్ణా** జిల్లాలో గుణదల- నున్న రహ దారి విస్తరణ కోసం తవ్విన మట్టిని అడ్డదిడ్డంగా వేసిన మట్టితో కాలు వలు పూడుకుపోయాయి. దీంతో వర్ష పునీరు బయటకు పోలేక దాదాపు 300 ఎకరాల్లో వరి పంట ముంపు నకు గురైంది. సాగునీటి ఎద్దడి వల్ల జిల్లాలోని కోడూరు, నాగాయలంక మండలాల్లో ఆయకట్టు చివరి భూముల్లో వరిపైరు ఎండి తీవ్రంగా నష్టపోయారు. **గుంటూరు** జిల్లా బాపట్ల నియోజక వర్గంలోనూ కాలువ చివరి భూముల్లో వెయ్యి ఎక రాల్లో వరి పైరు ఎండిపోయింది. వేమూరు నియోజక వర్గంలోనూ సాగు నీరందక రైతులు ఆందోళన చెందారు. కర్నూలు జిల్లా ఎమ్మిగ నూరు ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా కురిసన వర్షాలకు కోసిన ఉల్లి పంట తడిసి పొలంలోనే మొల కొచ్చింది.

**ఆదిలాబాదు** జిల్లాలో ఖరీఫ్ పంట లకు 55 శాతం మేర నష్టం వాటిల్ల డంతో జిల్లాలోని మొత్తం 52 మండలా లను కరవు ప్రాంతాలుగా ప్రకటించింది.

**కరీంనగర్** జిల్లా బెజ్జంకి ప్రాంతంలో పత్తి పంట సాగు చేస్తున్న ప్రకాశం జిల్లా కౌలు రైతులకు వర్షాభావంతో పెట్టుబడులు కూడా దక్కలేదు. జగి త్యాల మండలంలో వర్షాభావంతో పంటలు ఎండి, చీడపీడల ఉధృతి పెరిగి నష్టం వాటిల్లింది.

**ఖమ్మం** జిల్లా కొణిజర్ల మండలంలో వర్షాభావంతో దెబ్బతింటున్న మిర్చి పంటను దక్కించుకునేందుకు ఎక రాకు రూ. 6 వేల చొప్పున తోటి రైతుల నుంచి సాగునీటిని కొనుగోలు చేసి వాడుకున్నారు. జిల్లాలో వర్షా భావం వల్ల సుమారు 14.7 హెక్టా ర్లలో ఎండిపోయిన పంటలకు రూ. 6.16 కోట్లు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుందని నివేదిక తయారుచేశారు.

**రంగారెడ్డి** జిల్లాలో మొక్కజొన్న, పత్తి, పసుపు, కూరగాయ పంటలు ఎడతెరిపి లేని వర్షాలకు పాడ



T

య్యాయి. వర్షాభావంతో పెసర, మినుము, మొక్కజొన్న పైర్లు కూర గాయ పైర్లు ఎండిపోయాయి. పత్తిలో 30-40 శాతం మేర దిగుబడి తగ్గనున్నట్లు అంచనా వేశారు.

### విద్యుత్ సమస్యలు

**విశాఖ** జిల్లాలో దసరా మామూళ్లు ఇవ్వలేదని వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా నిలిపేయడంతో పాయకరావుపేట మండలం అరట్లకోటకు చెందిన రైతులు సబ్‌స్టేషన్ ముట్టడించి, రాస్తారోకో చేశారు. ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. **మహబూబ్‌నగర్** జిల్లా నారాయణపేట ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం, పరిసరాల్లో మరమ్మత్తు కేంద్రాలు లేకపోవడంతో నానా అవస్థలు పడ్డారు. అస్తవ్యస్త విద్యుత్ సరఫరాతో పంటలు ఎండుతుండడంతో వెంకటాపురం సబ్‌స్టేషన్ వద్ద రైతులు రాస్తారోకో చేసి, అధికారులను నిర్బంధించారు. **రంగారెడ్డి**జిల్లా దిర్సంపల్లిలో మరమ్మతుల పేరిట 15 రోజులపాటు విద్యుత్ సరఫరా నిలిపేయడంతో వరిపైరు ఎండి రైతులు ఆందోళన చెందారు. రంగారెడ్డి జిల్లా పొద్దటూరులో బిగించిన ట్రాన్స్‌ఫార్మర్ 25 రోజుల్లోనే ఏడుసార్లు కాలిపోవడంతో పంటలు ఎండిపోయాయి.

✦ జాతీయ ఆహార భద్రతా పథకం కింద వరి, పప్పుధాన్యాలు పండించే చిన్న, సన్నకారు రైతులకు 50 శాతం రాయితీపైన కేంద్ర వ్యవసాయ శాఖ ఆయిల్ ఇంజన్లు (పంపుసెట్లు) మంజూరు చేస్తుంది.

### పాడి, మత్స్య పరిశ్రమలు

**తూర్పు గోదావరి** జిల్లా కొత్తపల్లి మండలం కొమరిగిరికి చెందిన రైతులు 'అజొల్లా'ను ఉత్పత్తిచేసి పశువులకు మేపుతూ దాణా ఖర్చును తగ్గించుకొని అధిక పాల దిగుబడిని పొందుతున్నారు.

✦ రాష్ట్రంలో చేపల పెంపకం ఆటుపోట్లను ఎదుర్కొంటోంది. వాతావరణంలో మార్పులు, వర్షాభావంతో సాగునీటి కొరత, మేతలు, రసాయనాల ధరలు పెరగడం, నిల్వ సదుపాయాలు, మార్కెట్ వసతి లేక కృష్ణా జిల్లాలో చేపల రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

**కృష్ణా**జిల్లాలోని పలు గ్రామాల్లో పశుగ్రాసం కొరతకు తోడు పారిశుద్ధ్యం అదుపుతప్పి దోమలు వ్యాప్తిచెందడంతో పాల ఉత్పత్తి పడిపోయినట్లు గుర్తించారు. కొందరు మస్కిటో కాయిల్స్, దోమతెరలు వాడి వాటి సమస్యనధిగమించే ప్రయత్నం చేశారు.

### అవీ... ఇవీ... అన్నీ...

**గుంటూరు** జిల్లాలో ఒక్కో కాంప్లెక్సు ఎరువు బస్తాపై వ్యాపారులు రూ. 50-100 దాకా అధికంగా వసూలు చేశారు. కొన్ని ప్రధాన కంపెనీలు ఎరువులతోపాటు సల్ఫర్, మల్టీవిటమిన్, అమోనియం సల్ఫేట్‌లను అంటగడుతుండడంతోనే ఎక్కువ ధరకు అమ్మాల్సి వస్తోందని వ్యాపారులు పేర్కొన్నారు. కడప జిల్లాలో ఒక్కో బస్తాపై రూ. 75-200 దాకా అధికంగా వసూలు చేశారు.

**కడప**జిల్లా సంబేపల్లి, చిన్నమండెం మండలాల్లో వర్షాభావంతో పంటలు దెబ్బతిని, వేరుసెనగలో 30 శాతం దిగుబడి కూడా రాని పరిస్థితులున్నా కరవు జాబితాలో చేర్చకపోవడంతో రైతులు, నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. ఆగస్టు చివరలో ఒకే రోజు కురిసిన అత్యధిక వర్షపాతాన్ని పరిగణలోకి తీసుకోవడం వల్లనే ఇలా జరిగినట్లు వాపోయారు.

**అనంతపురం** జిల్లాలో 80 శాతం రుణాలు పంపిణీ చేశామని బ్యాంకులు ప్రకటించుకుంటున్నా వాస్తవ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉందని సగం మందికీ రుణం అందలేదని క్షేత్రస్థాయిలో వెల్లడైంది.

**చిత్తూరు** జిల్లా పెద్ద పంజాని మండలం బసవరాజు కండ్రిగ గ్రామానికి చెందిన రెడ్డెప్ప తన పొలంలో ప్రభుత్వ సహకారంతో నిర్మించుకున్న నీటికుంటతో కరవు పరిస్థితుల్లోనూ 4 ఎకరాల్లో చెరకు, వంగ, టొమాటో పైర్లను సాగుచేసి మంచి ఆదాయం పొందారు.

**వరంగల్** జిల్లాలో ప్రయోగాత్మకంగా రైతుల పొలాల్లో పత్తిలో అంతరపంటగా సాగుచేసినప్పుడు ఎర్రనేలలో పెసర, నల్ల నేలల్లో మొక్కజొన్న (పచ్చికంకుల కోసం) పంటలు అధిక ఆదాయాన్నిచ్చాయి.

**మహబూబ్‌నగర్** జిల్లా బాదేపల్లి మార్కెట్లో సి.సి.ఐ. కొనుగోలు కేంద్రాలు లేక వరి, మొక్కజొన్నల నిల్వకు గిడ్డంగుల సదుపాయం లేక రైతులు అష్టకష్టాలు పడ్డారు.

**మెదక్**జిల్లా మదూర్ పశువైద్యుడు డా. మనోహర్‌రెడ్డి గత 9 నెలలుగా విధుల్లోకి రాకుండానే వేతనం పొందుతూ మోసం చేస్తున్నారని స్థానిక స్నేహ యూత్ క్లబ్ సభ్యులు తహసిల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ కోసం వచ్చిన ఎ.డి. రమణయ్యను వారు నిర్బంధించారు.

**రంగారెడ్డి** జిల్లాలోని తాండూరు డివిజన్‌లోని 4 సహకార సంఘాల ద్వారా జరిగే రుణాల పంపిణీలో 10 శాతానికి బదులుగా 15 శాతం వసూలు చేసి స్వాహా చేస్తున్నట్లు రైతులు ఆరోపించారు. కరీంనగర్, మెదక్ జిల్లాల్లో బ్యాంకుల నుంచి రుణాలు లభించక ఆందోళనకు దిగి అధికారులను నిర్బంధించారు.

★

## అభివృద్ధి సాధిస్తున్న రైతులు

**గుంటూరు** జిల్లా పొన్నపల్లికి చెందిన కుంచల శ్రీనివాసరెడ్డి బి.ఎస్సీ, బీఈడీ చదివినా వ్యవసాయంపై ఉన్న మక్కువతో ఆధునిక పద్ధతులు పాటిస్తూ సేంద్రియ వ్యవసాయం, పాడి పశువుల పోషణలో సత్ఫలితాలు సాధిస్తున్నారు. తరచూ రైతు సదస్సుల కెళ్లి కొత్త పరిజ్ఞానాన్ని తెలుసుకొని ఆచరిస్తోన్న ఈ రైతు 2002లో కావూరులోని కె.వి.కె. నుంచి ఆదర్శరైతుగా కూడా ఎంపిక కావడం గమనార్హం.

**కడప** జిల్లా చిన్నమండెం మండలం ఎగువగడ్డ హరిజనవాడకు చెందిన ఎస్.నారాయణ బీఈడీ పూర్తిచేసినా సరైన ఉద్యోగం రాలేదు. అయినా కుంగిపోక మండల పశువైద్యాధికారి సహకారంతో ముఖ్యమంత్రి ప్యాకేజీ కింద పొందిన 2 సంకర జాతి ఆవుల పోషణతో రోజూ 30లీ. పాలు విక్రయిస్తూ నెలకు 5 వేల దాకా సంపాదిస్తూ హాయిగా జీవనం సాగిస్తున్నాడు. సంపాదించిన సొమ్ముతో ఇప్పటికే రూ. 1.5 లక్షలతో ఇల్లు నిర్మించుకోవడమే గాక మరో రూ. 40 వేలు పొదుపు చేశారు.

**కర్నూలు** జిల్లా ఆదోని పట్టణం నుంచి వచ్చే మురుగునీటిని పంటచేలకు మళ్లించి వెయ్యి ఎకరాల్లో వరి, కూరగాయలు, పశుగ్రాసాలు, సజ్జ తదితర పైర్లసాగుతో కరవులో సత్ఫలితాలు సాధిస్తున్నారు. మురుగునీటితో ఎకరాకు 35 బస్తాల వరిధాన్యం తీస్తున్నారు. పచ్చగడ్డిని పెంచి విక్రయిస్తున్నారు.

**చిత్తూరు** జిల్లా కుప్పం మండలంలో సివిల్ ఇంజనీరింగ్‌లో పట్టభద్రుడైన గోనుగూరు వాసి కె.ఆర్. భాస్కరనాయుడు ఉద్యాన పంటల సాగుతో సత్ఫలితాలు సాధిస్తున్నారు. బొప్పాయి, చామంతి, టొమాటో పంటల సాగుతో మంచి ఆదాయం పొందుతున్నారు. తమిళనాడు వ్యాపారులు తోట వద్దకే వచ్చి 15 కిలోల టొమాటోలు రూ. 40-50, కిలో బొప్పాయి రూ. 5-10 చొప్పున కొనుగోలు చేస్తున్నారు.